నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: జలమండలి విభాగం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన పనులకు నిధులు మంజూరు చేయాలని జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డికి సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన వివరాలను ఆయన ఎండీకి వివరించారు. కాలం చెల్లిన పైపులైన్ వ్యవస్థతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దశలవారీగా తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ ఆధునీకరించేందుకు చేయూతను ఇవ్వాలని కోరారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతి ప్రతం అందజేస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కార్పొరేటర్ పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ముఖ్యంగా నిలిచిపోయిన రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు, నూతన రోడ్డు నిర్మాణ, డివిజన్‌లోని పార్కుల సుందరీకరణ, స్ట్రీట్ లైట్ల క్రమబద్ధీకరణలపై జోనల్ కమిషనర్‌కు మరో వినతి పత్రం సమర్పించారు. పనులకు వెంటనే అనుమతులు కల్పించి సంబంధింత అధికారుల ద్వారా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

వేతన సలహా మండలిలో కార్మిక సంఘాలకు స్థానం కల్పించాలి



కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు

చిక్కడపల్లి: కనీస వేతన సలహామండలిలో రాష్ట్రంలో అన్ని కార్మిక సంఘాలకు స్థానం కల్పించాలని తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ రాష్ట్ర కార్మిక కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు భూపాల్, జి.రాంబాబుయాదవ్, ఎస్. బాలరాజ్, కె. సూర్యం, పి.శివబాబు, ఎస్ఎల్.పద్మ, ప్రవీణ్, భిక్షపతి, మారన్న మాట్లాడుతూ.. మండలిలో అధికార పార్టీకి చెందిన వారికే ప్రాతినిధ్యం కల్పించడం సరికాదన్నారు. జీఓ నం .21ను సవరించి రాష్ట్రంలోని కార్మిక సంఘాలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. అనంతరం రాష్ట్ర కార్మికశాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్‌కు వినతిప్రతాన్ని అందజేశారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నివాసంలో సోమవారం వినతి పత్రం సమర్పించినట్లు బీసీ నేత లింగంగౌడ్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయనందున నాలుగు సంవత్సరాల నుంచి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని మంత్రికి వివరించినట్లు చెప్పారు. కాలేజీలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయనందున డిగ్రీ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

పీహెచ్‌డీ విద్యార్థులకు గడువు పొడిగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 2018లో ప్రవేశం పొందిన పీహెచ్‌డీ విద్యార్థులకు పరిశోధన అంశాల సమర్పణకు గడువు పొడిగించాలని ఓయూ అధికారులకు వినతి పత్రం సమర్పించినట్లు ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొమ్ముశేఖర్ మాదిగ సోమవారం తెలిపారు. 2018లో ప్రవేశం పొందిన విద్యార్థులకు 2020 నుంచి 2022 వరకు కరోనా కారణంగా పరిశోధనలకు అంతరాయం ఏర్పడిందన్నారు. పరిశోధనకు ఏడాది గడువు పొడిగించడంతో పాటు ప్రొగ్రెస్ సెమినార్-2, రీసెర్చ్ డిజైన్ సెమినార్ గడువు, ప్రీ-పీహెచ్‌డీ పరీక్షలు రాసుకునేందుకు అనుమతి కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

ధీర వనితలను విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకోవాలి



ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులతో రచయితలతో వేదకుమార్, శివరామకృష్ణ, శ్రీనివాసరావు



విద్యార్థి శ్రీనిధికి ప్రశంస పత్రం అందజేస్తున్న పందిరి శ్రీనివాసరావు

చిక్కడపల్లి: ప్రాజెక్ట్ ఏ,బీ,సీ,డీలో భాగంగా 10 ఏళ్ల పాటు షీరోస్ పేరుతో దేశంలోని పలు రంగాలలో పని చేసిన మహిళామణులను పరిచయం చేస్తూ వెలువరించిన షీరోస్ ''ధీర వనితలు - స్ఫూర్తి కాంతులు'' తెలుగు పుస్తకావిష్కరణ సభ హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగింది. ధీర వనితల స్ఫూర్తిని ఈతరం ఆడపిల్లలు అందిపుచ్చుకోవాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 256 మంది పిల్లలు షీరోస్ అలంకరణలో అభినయించి ఆకట్టుకున్నారు. వారికి ధ్రువపత్రాలు అందజేశారు. పుస్తక రచయితలు డాక్టర్ జాస్తి శివ రామకృష్ణ, అయ్యాల సోమయాజుల అహల, పుస్తాకాన్ని ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించిన వంగపల్లి పద్మ, బొమ్మలు వేసి దుంద్రపెల్లి బాబు, నాన్ రెసిండెంట్ ఇండియన్ వాసవి అసోసియేషన్(ఎన్ఆర్ఐవీఏ) ప్రతినిధి పందిరి శ్రీనివాసరావు, సాహితీవేత్త వేదకుమార్, నగరంలో రచయితలు, కవులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బలిజేపల్లి లక్ష్మీకాంతం



మాట్లాడుతున్న పొత్తూరి సుబ్బారావు, జనార్దనామూర్తి, కొల్లి నాగేశ్వర్‌రావు

చిక్కడపల్లి: బలిజేపల్లి లక్ష్మీకాంతం బహుముఖ ప్రజ్ఞాశాలి అని పత్రికా సంపాదకులు పొత్తూరి సుబ్బారావు అన్నారు. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభ నిర్వహణలో నాటక రచయిత, నటుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా మాట్లాడారు. నాటక సినీ రచయితగా సుప్రసిద్ధులన్నారు. జాతిపిత గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్ధనామూర్తి మాట్లాడుతూ.. లక్ష్మీకాంతం కవి నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు, కళా పోషకుడు బింగి నరేందర్‌గౌడ్, గాయని డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవ



పటేల్‌నగర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి పటేల్‌నగర్‌లో రూ.13లక్షల సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశలవారీగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతామన్నారు. రోడ్లు నిర్మించిన తర్వాత పైపులైన్‌ల కోసం రోడ్లను తొవ్వొద్దని ఆయన అధికారులకు సూచించారు. సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ నిధులు వృథా కాకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన ప్రజా సమస్యలపై స్థానికులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేశ్‌యాదవ్, మహేశ్ ముదిరాజ్, వెంకటేష్, సంతోష్ తదితరలు పాల్గొన్నారు.

పీవీ తెలంగాణలో పుట్టడం మనకు గర్వకారణం



పీవీవిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీబీఎస్ఎస్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు

నల్లకుంట: గడ్డు కాలంలో ప్రధానిగా సేవలందించి ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడిన దివంగత మాజీ ప్రధాని పీవీ. నరసింహారావు తెలంగాణలో పుట్టడం మనందరికీ గర్వకారణమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి పీవీకి భారతరత్న ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం దివంగత పీవీ 20వ వర్ధంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన రమణా రావు నల్లకుంటలోని సమితి కార్యాలయంలో మాట్లాడారు. ఉత్తర తెలంగాణలోని ఏదైనా ఒక జిల్లాకు ఆయన పేరు పెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని గుర్తుచేశారు. ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ ఉపాధ్యక్షుడు దేశ్‌ముక్ రమాకుమార్, కోశాధికారి మంత్రి సునిల్, ప్రముఖ న్యాయవాధి శ్యాంసుందర్ రావు, గూడా రాజేశ్వర రావు, గూడా జయరాం, జె.శశాంక్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డికి అభినందనల వెల్లువ



సుందరయ్య పార్కులో నూతన అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాకర్స్ క్లబ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీ నిరంజన్‌రెడ్డికి వాకర్స్ సభ్యులు సోమవారం సుందరయ్య పార్కులో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్కు అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ, సలిపెల రమేష్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, శంకర్, నిమ్మ రాజశేఖర్, టి.సైక్లోబ్‌బాబు, కోట రమేష్, మోహన్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మలుపు తిరిగిన వాకర్స్ క్లబ్ ఎన్నికలు

వాకర్స్ క్లబ్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన



పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వివేక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలోని సుందరయ్య పార్కులోని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్‌కు ఈనెల 29న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు ఆర్.వివేక్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను సోమవారం సుందరయ్య పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈనెల 24న పార్కులోని కార్యాలయంలో ఉదయం 8 నుంచి 10గంటల వరకు రూ.వేయి చెల్లించి నామినేషన్ వేయాలన్నారు. వాకర్స్ క్లబ్ ఎన్నికలు ఈనెల 29న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

సంధ్య థియేటర్ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

కాచిగూడ: హీరో అల్లు అర్జున్ నిర్లక్ష్యం, దుష్ప్రవర్తన కారణంగా బాలల హక్కులతో పాటు వారి సంక్షేమం ప్రమాదంలో పడిందని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. సంధ్య థియేటర్ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం న్యూఢిల్లీలో జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమిషన్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

రేవతి కుటుంబానికి అండగా వైశ్య సమాజం



రేవతి భర్త భాస్కర్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న వీబీజీ ఫౌండర్ రాజు మడిపడిగె

కాచిగూడ: సంధ్య థియేటర్ ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబానికి వైశ్య సమాజం అండగా ఉంటుందని వీబీజీ ఫౌండర్ మడిపడిగె రాజు అన్నారు. వీబీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం రేవతి భర్త భాస్కర్‌ను కలిసి తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. వైశ్యులకు ఎక్కడ ఏ ఆపద ఉన్నా తాము అండగా ఉంటామని సిల్వెల్ అధినేత బండారు సుబ్బారావు తెలిపారు. కాశీ, ఇమ్మడి రమేష్, రామ సత్యనారాయణ, అలపాటి శ్రీకర్, పబ్బతి రవి, కొల్లిపర రవి, నరేష్, డాక్టర్ శ్రీకాంత్, చికోటి దయాకర్ తదితరులు రేవతి కుటుంబానికి సహకరించిన వారిలో ఉన్నారు. రేవతి కుటుంబానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడి అరెస్టు

కాచిగూడ: మద్యానికి బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న ఓ పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డీఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ... విఠల్‌వాడిలో నివాసం ఉండే దత్తుకుమార్(25) ఓ ప్రైవేట్ హాస్టల్‌లో వంటపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడగా అతనికి వచ్చే జీతం సరిపోకపోవడం లేదు. దీంతో వక్రమార్గాన్ని ఎంచుకుని దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. ఈనెల 20వ తేదీన విఠల్‌వాడిలోని వార్డు కార్యాలయంలో ఉన్న బోరు మోటార్‌ను చోరీ చేసి తప్పించుకుని తిరుగుతున్నాడు. జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా దత్తుకుమార్‌ను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో అతని వద్ద నుంచి బోర్ మోటార్‌ను స్వాధీనం చేసుకొని సోమవారం రిమాండ్‌కు తరలించారు. డీఎస్ఐ వెంకటేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థిని ఆత్మహత్య

చిక్కడపల్లి: గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఓ విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ జవహర్‌నగర్‌లోని సాయి ప్రహరియ గర్ల్స్ హాస్టల్లో కామారెడ్డి జిల్లాకు చెందిన సురేఖ నాయక్ (24) గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. సోమవారం రాత్రి ఆమె ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, డీఐ శేఖర్, ఎస్సై మౌనిక వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కొన ఊపిరితో ఉన్న సురేఖను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆ విద్యార్థిని మృతిచెందినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు పోలీసులు పేర్కొన్నారు. గది లోపలి నుంచి గడియ పెట్టుకుని చున్నితో ఉరివేసుకొని ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వివరించారు. ఆమెకు వివాహం నిశ్చయమైందని మృతురాలి స్నేహితులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.

భువనేశ్వరి రచనలు నేటి సమాజానికి ఆదర్శం



గురు వోంకా గురు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వీడీ రాజగోపాల్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి భువనేశ్వరి మారేపల్లి రచనలు నేటి సమాజానికి ఆదర్శం అని రాష్ట్ర ఖనిజ శాఖ మాజీ డైరెక్టర్, ప్రముఖ కవి డాక్టర్ వీడీ రాజగోపాల్ తెలిపారు. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి బిక్కి కృష్ణ అధ్యక్షతన భువనేశ్వరి హిందీ అనువాద గ్రంథం గురు వోంకా గురు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎన్నో పరిశోధనలు చేసి ఇలాంటి గ్రంథాలు రాశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.విజయలక్ష్మి పండిత్, ప్రముఖ కవి జల్ది విద్యాధర్, ప్రొ. డాక్టర్ ఎం.యశోధాదేవి, అబూరి జానకి, మిర్యాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భువనేశ్వరి దంపతులను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు పరిశోధనల వైపు సాగాలి



టెక్ స్టార్మ్ 2024 పేరిట అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ. ఎస్‌కే మహమ్మూద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశ ఆర్థికాభివృద్ధిలో భాగంగా విద్యార్థులు పరిశోధనల వైపు సాగాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ. ఎస్‌కే మహమ్మూద్ అన్నారు. జ్ఞానాన్ని పెంచుకున్నప్పుడే అది మన అభివృద్ధికి దోహదపడుతుందని సూచించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో టెక్ స్టార్మ్ 2024 పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా ప్రొ. ఎస్‌కే మహమ్మూద్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య మంచి సంబంధాలను మెరుగు పరుచుకోవాలన్నారు. అప్పుడే వారిలో నైపుణ్యత పెరుగుదలకు దోహదపడుతుందని అన్నారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యతను సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటే ప్రపంచ వ్యాప్తంగా మంచి అవకాశాలు లభిస్తాయని సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా మంచి అవకాశాలు వస్తాయన్నారు.

◆ అవంతి విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. తమ కళాశాలలో చదివే విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. జి.నరేష్‌రెడ్డి, ప్రొ. డి.కరుణసాగర్, జితేందర్‌సింగ్, ప్రొ. ఎన్.కిషోర్‌కుమార్, ప్రొ.కె.శ్యామల, శ్రీనివాస్ నామాల, కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, ప్రిన్సిపల్స్ ప్రొ. వి.అప్పారావు, డాక్టర్ ఎస్.అప్పారావు, డాక్టర్ జి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు బూత్ కమిటీ సభ్యులు తమ వంతు కృషి చేయాలని నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత సూచించారు. బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శి భువనగిరి సురేష్‌యాదవ్ అధ్యక్షతన సోమవారం కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ డివిజన్ 91వ బూత్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేష్‌యాదవ్ సూచనల మేరకు 91వ బూత్ నూతన కమిటీ అధ్యక్షుడిగా సాయికుమార్ ప్రధాన కార్యదర్శిగా ఓంప్రకాశ్‌ను నియమిస్తూ కార్పొరేటర్ నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కృష్ణగౌడ్, నియోజకవర్గ నాయకులు శ్యామ్‌రాజ్, కేబీ నర్సింగ్‌రావు, సుధాకర్, సాయి, వరుణ్, రాజేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ



హైదరాబాద్ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ముషీరాబాద్: తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం హైదరాబాద్ జిల్లా విస్తృత స్థాయి కమిటీ సమావేశం సోమవారం సీపీఎల్ఏ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గరికె ఉపేందర్‌రావు హాజరయ్యారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుగా కొంపల్లి విజయరావు, ప్రధాన కార్యదర్శిగా టి.రాములు, కోశాధికారిగా వర్కల గణేష్, అసోసియేట్ అధ్యక్షులుగా పెరుమాళ్ల విజయ్‌కుమార్, మారె కృష్ణ, ఉపాధ్యక్షులుగా నైని శ్రీరాములు, మహాలక్ష్మి, పెబ్బేటి ఉషన్న, కార్యదర్శులుగా కాపరవేలి రాజు, స్వామి, మహబూబ్‌ఖాన్, అజర్‌ఖాన్, పులి శివరాం, ప్రచార కార్యదర్శులుగా కొర్రావత్ అనిల్, సుజాత, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎం.ఏ. సలీమ్, ఓంప్రకాష్‌లు ఎన్నికయ్యారు. ఇంకా ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, భూమి సునీల్, తహసీల్దార్ల అధ్యక్షులు రాములు, రాష్ట్ర వీఆర్‌వోల అసోసియేషన్ అధ్యక్షులు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే నియమించాలి



పి.లక్ష్మీనారాయణను అభినందిస్తున్న అనంతపాల్, కాళీముత్తు

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ నేతలు అనంత పాల్, కాళీ ముత్తు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారతీయ పోస్టర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అనుబంధ సంఘాల 4వ సంయుక్త రాష్ట్ర మహాసభలు నారాయణగూడలోని సర్దార్ పటేల్ ఆడిటోరియంలో జరిగాయి.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యదర్శి రామ్‌మోహన్ మాట్లాడుతూ.. ఉద్యోగస్తులు దేశభక్తితో కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సమ్మె తమ చివరి ఆయుధమని ఆయన అన్నారు. అసంబద్ధమైన టార్గెట్‌తో పోస్టల్ ఉద్యోగులను వేధిస్తున్న అధికారుల వైఖరికి నిరసనగా ట్రేడ్ యూనియన్ యాక్షన్‌లోకి వెళ్లాలని ఉద్యోగస్తులు తీర్మానం చేశారు.

◆ ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికి గాను భారతీయ పోస్టర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గ్రూప్-సి రాష్ట్ర కార్యదర్శిగా పి.లక్ష్మీనారాయణ, పోస్ట్‌మాన్-ఎంటీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా షేక్ లాల్‌మియా, భారతీయ గ్రామం డాక్ కర్మచారి సంఘ్ రాష్ట్ర కార్యదర్శిగా వినయ్ సుధీర్, సూపర్‌వైజర్స్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్ రావుని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ బ్యాంక్ కర్మచారి సంఘ్ నాయకులు చంద్రశేఖర్, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 400లకు పైగా ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ఆరోగ్య మిత్రలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరియాదయ్య, ప్రధాన కార్యదర్శి కుమార్‌ల ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆరోగ్య మిత్రలకు డాటా ఎంట్రీ ఆపరేటర్స్ కేడర్‌ను అమలు చేయాలన్నారు. పెరిగిన జీతాలను వర్తింపజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఉపాధ్యక్షులు సుమన్, శ్రీకాంత్, రత్నం, నాగరాజు, అనిల్, రవీందర్, శ్రీనివాస్, కురుమయ్య తదితరులు ఉన్నారు.